క్లుప్తంగా

వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి పొన్నం



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 10 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు శనివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌లోని ఆయన నివాసంలో జాతర వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈనెల 10 నుంచి ప్రారంభమయ్యే కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కిషన్‌రావు, అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

సమాజంలో బ్రహ్మకుమారీల పాత్ర గొప్పది



పరకాల : అధ్యాత్మిక యోగా ద్వారా సమాజాన్ని చైతన్య పర్చడంలో ప్రజాపిత బ్రహ్మకుమారీల పాత్ర గొప్పదని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయానికి సంబంధించిన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం ఆవిష్కరింపజేశారు. బ్రహ్మకుమారీలు విజయలక్ష్మి, విమల, సాంబమూర్తి, రవీందర్ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన మద్యం మత్తు

శాయంపేట : మద్యం మత్తు ఓ యువకుడి ప్రాణం తీసింది. స్థానిక ఎస్సై పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన నిమిషకవి నాగరాజు(25) కూలీ పని చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. నాగరాజు శుక్రవారం రాత్రి మద్యం సేవించి మత్తులో ఇంటికి వెళ్లి తల్లి భాగ్యమ్మతో గొడవ పడ్డాడు. దీంతో ఆమె బయటికెళ్లింది. ఈ క్రమంలో నాగరాజు ఇంటి తలుపులు వేసుకున్నాడు. తన కుమారుడు నిద్రిస్తున్నాడని భావించి ఆమె పక్కింట్లో నిద్రించింది. శనివారం ఉదయం తల్లి భాగ్యమ్మ వెళ్లి చూడగా ఇంటి పైకప్పు ఇనుపపైపుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి తల్లి భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఎస్సై తెలిపారు.

నేడు ఇంటలెక్చువల్ ఫోరం వర్క్‌షాప్

కేయూ క్యాంపస్: బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 5న ఘట్కేసర్ ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద జేకే కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని రాష్ట్ర నిరుద్యోగ జేఏసీ కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్, జేఏసీ ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి నరేష్‌గౌడ్ కోరారు. కేయూలో శనివారం నిర్వహించిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. సభలో బీసీల రాజకీయ ఎదుగుదలకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి, రాబోయే స్థానిక సంస్థల్లో బీసీల వ్యూహాలు ఎలా ఉండాలనే అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు వివరించారు. సమావేశంలో నిరుద్యోగ జేఏసీ ఇన్‌చార్జ్ అభిరామ్ రమేష్, అధ్యక్షుడు గుండేటి సుమన్, రాష్ట్ర నాయకులు పాషా, రమేష్‌చంద్ర, అరుణ్‌కుమార్, కుమార్ స్వామి, రాము తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాల ఆధ్వర్యంలో ఈనెల 5నుంచి 26వ తేదీ వరకు సుబేదారిలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ అమర్‌నాథ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న పోటీల్లో నగరం నుంచి 32 జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. విజేత జట్టుకు రూ.50 వేల నగదు పురస్కారం, ట్రోఫీ, రన్నరప్ జట్టుకు రూ.30వేల నగదు పురస్కారంతో పాటు ట్రోఫీని అందజేయనున్నట్లు వివరించారు.

7న శ్వేతార్కలో చిత్రన్నపూజ

కాజీపేట: శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో ఈనెల 7న వందలాది భక్తుల ఆధ్వర్యంలో జరగనున్న చిత్రన్నపూజను విజయవంతం చేసేలా కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ సూచించారు. కాజీపేట పట్టణంలోని ఆలయ సమావేశ మందిరంలో కార్యకర్తల సమావేశం శనివారం రాత్రి జరిగింది. సమావేశంలో ఆలయ పరిపాలన అధికారి సాయికృష్ణ శర్మ, దేవులపల్లి సదానందం, రవి పాల్గొన్నారు.

అటు చెరువు.. ఇటు బావులు



ఎర్రబెల్లి, చింతలతండా గ్రామాల మధ్య చెరువు కట్టరోడ్డు



చెరువు కట్ట పక్కన ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావి

- ప్రమాదమని తెలిసినా తప్పని ప్రయాణం
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్న వాహనదారులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

వేలేరు : మండలంలోని ఎర్రబెల్లి నుంచి చింతలతండా మీదుగా వేలేరు మండల కేంద్రానికి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో ఎర్రబెల్లి గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎర్రబెల్లి నుంచి సూమారు కిలోమీటరు దూరంలో ఉన్న చింతలతండా గ్రామానికి వెళ్లేందుకు జాజిరేణికుంట చెరువు కట్టపై నుంచి ఉన్న మట్టిరోడ్డే దిక్కు అవుతోంది. మట్టిరోడ్డు కూడా పెద్దపెద్ద గుంతలతో ప్రమాదకరంగా ఉన్నప్పటికీ ప్రయాణించక తప్పడం లేదని పలువురు వాపోతున్నారు. ఓ వైపు చెరువు, మరోవైపు వ్యవసాయ బావులు ఉండటంతో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నామని గ్రామస్తులు అంటున్నారు. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరి అధ్వాన్నంగా ఉంటుందని, మట్టి రోడ్డంతా బురదమయంగా మారి గుంతల్లో పడి ప్రమాదాలు బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పడిపోతే ప్రమాదమే..

ఎర్రబెల్లి నుంచి చింతలతండా మీదుగా మండల కేంద్రానికి వెళ్లే దారిలో ఉన్న జాజిరేణి కుంట చెరువు కట్ట చిన్నగా ఉండటంతో పాటు మట్టిరోడ్డు పూర్తిగా అధ్వానంగా మారింది. చెరువు కట్టపైన ఉన్న రోడ్డులో ఒక వాహనం వస్తే మరో వాహనం వెళ్లేందుకు వీలులేకుండా ఉంది. ప్రమాదకరంగా ఉన్న మట్టిరోడ్డుపై పగలు వెళ్లాలంటేనే కష్టంగా ఉంటుందని, రాత్రిసమయంలో ప్రయాణించాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించే పరిస్థితి దాపురించిందని స్థానికులు తెలిపారు. అలాగే చెరువు కట్టపై నుంచే మండల కేంద్రానికి ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు నిత్యం వెళ్తుందనీ, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతూ పిల్లలను పాఠశాలకు పంపించాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎర్రబెల్లి, చింతలతండా గ్రామాల మధ్యలో ఉన్న చెరువు కట్టపై బీటీరోడ్డు నిర్మించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ఎర్రబెల్లి నుంచి చింతలతండా మీదుగా వేలేరుకు వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేదు. జాజిరేణి కుంట చెరువు కట్ట చిన్నగా ఉంది. దీంతో కట్టపై నుంచి ఓ వాహనం వస్తే మరో వాహనం వెళ్లేందుకు వీలులేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఇప్పటికైనా బీటీ రోడ్డు వేసి చెరువు కట్టకు ఇరువైపుల ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి

– అల్లం సతీశ్, మాజీ ఉపసర్పంచ్, ఎర్రబెల్లి

వైభవంగా అయ్యప్ప పడిపూజ



అభిషేకాలు చేస్తున్న ప్రకాశం దంపతులు

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్ చిన్న చెరువు మత్తడి పరిసరాల్లోని శ్రీ మహాలింగమయ్య దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అయ్యప్పస్వామికి అన్ని రకాల అభిషేకాలతో పాటు దివ్య పడిపూజ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అయ్యప్ప మాలాధరులు, భక్తులకు అన్నప్రసాద వితరణ (బిక్ష) నిర్వహించారు. దీంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పూసాల ప్రకాశం, ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప మాలాధరులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఐపై డీజీపీకి ఫిర్యాదు

ఆత్మకూరు : పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన తనపై ఆత్మకూరు సీఐ సంతోశ్ అవమానపరిచే విధంగా మాట్లాడారని నల్లబెల్లి మండలం నందిగామకు చెందిన తేజావత్ సమ్మయ్య నాయక్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం డీజీపీకి ఫిర్యాదు తెసినట్లు పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన తనను ఏకవచనంతో మాట్లాడుతూ హేళన చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తనను అవమానించిన సీఐ సంతోశ్‌పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సంక్షిప్తంగా

భీంపల్లి వాసికి బెస్ట్ ఫోక్ సాంగ్ డైరెక్టర్ అవార్డు



కమలాపూర్ : మండలంలోని భీంపల్లికి చెందిన కురిమిండ్ల శ్రీనివాస్ ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ (ఇఫ్మా) బెస్ట్ ఫోక్ సాంగ్ డైరెక్టర్‌గా అవార్డు అందుకున్నారు. చిత్ర పరిశ్రమలో అసోసియేట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్.. ఫోక్ సాంగ్స్‌కు కూడా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ క్రమంలోనే శ్రీనివాస్ దర్శకత్వంలో రూపొందించిన 'పిలగ ఓ సీనయ్య బంగారు మనసయ్య' అనే ఫోక్ సాంగ్ విశేష ఆదరణ పొందగా ఆ ఫోక్ సాంగ్‌కుగాను ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ వారు శ్రీనివాస్‌ను బెస్ట్ ఫోక్ సాంగ్ డైరెక్టర్‌గా ఎంపిక చేశారు. ఇటీవల విశాఖపట్టణంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో విశాఖ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ సందర్భంగా నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఇఫ్మా జాతీయ అధ్యక్షుడు దిలీప్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.సూర్యనారాయణ, విశాఖపట్టణం మాజీ మేయర్ దాడి సత్యనారాయణ చేతుల మీదుగా శ్రీనివాస్‌కు బెస్ట్ ఫోక్ సాంగ్ డైరెక్టర్ అవార్డు అందజేశారు. శ్రీనివాస్ బెస్ట్ ఫోక్ సాంగ్ డైరెక్టర్ అవార్డు అందుకోవడంతో మండల ప్రజలతో పాటు భీంపల్లి వాసులు హర్షం వ్యక్తం చేశారు.

నియామకం



ప్రతాప్



తిరుపతి

నడికూడ : ధర్మసమాజ్ పార్టీ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కోడెపాక ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా బుస్స తిరుపతి, ఉపాధ్యక్షుడిగా మేకల ప్రవీణ్, కార్యదర్శిగా దుగ్గేల తిరుపతి, కోశాధికారిగా బొల్లు క్రాంతిరాజ్, సభ్యులుగా శనిగారపు అభిలాష్, బొట్ల శ్రీనును ఎన్నుకున్నారు.

యువకుడిపై కేసు

కమలాపూర్ : పాత కక్షలను మనసులో పెట్టుకుని దాడికి పాల్పడిన నడికూడ మండలం కంఠాత్మకూరుకు చెందిన కుమ్మరి శివాజీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరభద్రరావు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కంఠాత్మకూరుకు చెందిన మంతెపూరి రాజు తన మిత్రుడు బుస్స సురేందర్‌తో కలిసి కంఠాత్మకూరు నుంచి హైదరాబాద్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. కమలాపూర్ మండలం అంబాల, హసన్‌పర్తి మండలం నాగారం గ్రామాల మధ్య అంబాల శివారులో రాజు, సురేందర్ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని శివాజీ అడ్డుకుని పాత కక్షలను మనసులో పెట్టుకుని రాజును బూతులు తిడుతూ రాళ్లతో దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు శివాజీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తిలక్ మృతి బాధాకరం



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన ప్రాతికేయుడు బాల్నే తిలక్‌బాబు మృతి బాధాకరమని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి విచారణ వ్యక్తం చేశారు. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తిలక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన బాసాని కైలాసాన్ని, తహరాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రేణికుంట్ల సుమన్ తల్లి రాజమ్మ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్‌లో వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో భూపాలపల్లికి చెందిన గోపాల విజయ్ ద్విచక్రవాహనంలో రూ.6,349 విలువచేసే గుట్కాలను తరలిస్తున్నట్లు గుర్తించామని సీఐ సంతోశ్ తెలిపారు. అతడిని పట్టుకొని గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



నడికూడ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు పరకాలలోని సాహితి కళాశాల కరస్పాండెంట్ కందకట్ల రాజు శనివారం స్టడీ మెటీరియల్స్ అందించారు. ఎంఈఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కునుశోతు హనుమంతరావు చేతులమీదుగా అందజేశారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, మహ్మద్ సుభాని, శారదా, సుమలత, జోత్స్న, శివచేతన్, శ్రావణ్ కుమార్, తిరుపతి, శివకుమార్ పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

ఆత్మకూరు : కారును ఢీ కొట్టిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోశ్ శనివారం ప్రకటనలో తెలిపారు. ములుగు జిల్లా కొడిశలకుంటకు చెందిన కుందూరు తిరుపతిరెడ్డి కారులో ములుగుకు వెళ్తుండగా మండల కేంద్రం సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ కారును ఢీ కొట్టింది. దీంతో కారు డ్యామేజీ కాగా ఎవరికి గాయాలు కాలేదు. కారుకు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని లారీ డ్రైవర్ రాజన్ కుమార్‌పై బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

కమలాపూర్ : మండలంలోని వంగపల్లిలో ఇటీవల మృతిచెందిన ఆకునూరి రాకేష్ కుటుంబాన్ని అంబేడ్కర్ యువజన సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు ఎలుకటి అనిల్, ఉపాధ్యక్షుడు జూపాక ఉపేందర్, కాంగ్రెస్ నాయకుడు గూడెం మొగిలి, వివిధ పార్టీల నాయకులు శనివారం వేర్వేరుగా పరామర్శించారు. అనంతరం అనిల్, ఉపేందర్ కలిసి 50 కిలోలు, గూడెం మొగిలి 25 కిలోల చొప్పున బాధిత కుటుంబానికి బియ్యం అందించారు.

ఫిట్స్‌తో వ్యక్తి మృతి

వేలేరు : మండలంలోని పీచర శివారు వావిళ్లకుంట తండాకు చెందిన బానోతు నారాయణ (52) ఫిట్స్‌తో శనివారం సాయంత్రం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వావిళ్లకుంటతండాకు చెందిన బానోతు నారాయణ శుక్రవారం ఉదయం హుస్నాబాద్ వారాంతపు సంతకు ఉల్లినారు, టమాట నారు తీసుకురావడానికి వెళ్లగా అక్కడ ఫిట్స్ రావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స తీసుకుని ఇంటికి వస్తున్న క్రమంలో మరోసారి ఫిట్స్ రావడంతో కన్నారంలోని ఆర్‌ఎంపీకి చూపించి అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కాని అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య బానోతు బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బొగ్గు లారీలు అడ్డుకుని ఆందోళన



బొగ్గు లారీలను అడ్డుకుని ఆందోళన చేస్తున్న హమాలీ కూలీలు

కమలాపూర్ : తమకు రావాల్సిన కూలీ డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ హమాలీ సంఘం ఆధ్వర్యంలో కూలీలు బొగ్గు లారీలను అడ్డుకుని ఆందోళనకు దిగారు. ఈ సంఘటన మండలంలోని ఉప్పల్ కోల్ డంపింగ్ యార్డు వద్ద శనివారం రాత్రి చోటుచేసుకుంది. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ కోల్ డంపింగ్ యార్డులో బొగ్గు లోడింగ్, అన్ లోడింగ్ పనులు చేస్తున్నామని 27 వ్యాగిన్ల డబ్బులు రూ.3 లక్షల వరకు రావాల్సి ఉందని తెలిపారు. కూలీ డబ్బులు చెల్లించకుండా కాంట్రాక్టర్ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. డంపింగ్ యార్డు హమాలీ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులకు కూలీ డబ్బులు ఇచ్చామని అబద్ధాలు చెప్తున్నాడని ఆరోపించారు. డబ్బులు చెల్లించే వరకు లారీలను డంపింగ్ యార్డులోకి వెళ్లనియ్యామని భీష్మించారు. లోడింగ్ నిలిచిపోయింది.

గుంత పూడ్చేశారు..



నడికూడ : పరకాల–అంబాల ప్రధాన రహదారి కంఠాత్మకూరు గ్రామంలోని హనుమాన్ గుడి మలుపు వద్ద గుంత ప్రమాదకరంగా మారింది. ఈ నేపథ్యంలో గతనెల 24వ తేదీన 'గుంత..వాహనదారులకు చింత' అనే కథనం సాక్షి దినపత్రిలో ప్రచురితం అయ్యింది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. ప్రమాదకరంగా ఉన్న గుంతలను పూడ్చివేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి వాహనదారులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి



దామెర : విద్యార్థుతో మాట్లాడుతున్న ఎస్సై అశోక్



శాయంపేట : మాట్లాడుతున్న ఎస్సై పరమేశ్

- ఎస్సై అశోక్

దామెర : విద్యార్థులు, యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై కొంక అశోక్ అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మత్తుపదార్థాలతో వచ్చే అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి కష్టపడి చదువుకుని ఉన్నతశిఖరాలు అధిరోహించాలని అన్నారు. మత్తు పదార్థాలతో జీవితం నాశనం అవుతుందని, వాటికి దూరంగా ఉండాలని అన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని తదనుగుణంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సమ్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడుపొద్దు

శాయంపేట : మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని, మైనర్లు వాహనాలు నడుపొద్దని ఎస్సై జక్కుల పరమేశ్ సూచించారు. మండలంలోని నేరేడుపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించగా ఎస్సై పాల్గొని మాట్లాడారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావొద్దని అన్నారు. డ్రంకెన్‌డ్రైవ్, త్రిపుల్ రైడింగ్‌కు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దేశాభివృద్ధిలో ముఖ్యపాత్ర పోశించాలి

- డాక్టర్ పెండెం కృష్ణ కుమార్



చిత్రపటాలను అందజేస్తున్న కృష్ణకుమార్

ధర్మసాగర్ : దేశాభివృద్ధిలో, పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు ప్రముఖ పాత్ర పోశించాలని డాక్టర్ పెండెం కృష్ణ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన స్ఫూర్తిదాయక వ్యక్తుల పరిచయ కార్యక్రమంలో భాగంగా నాలుగుసార్లు గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును పొందిన డాక్టర్ పెండెం కృష్ణకుమార్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతిభ నైపుణ్యాలు, అన్వేషణ సామర్థ్యాలు, గ్రామీణ ప్రభుత్వ విద్యా సంస్థల విద్యార్థుల్లో అపారంగా ఉన్నాయని, వాటిని సరైన రీతిలో సద్వినియోగం చేసుకుని సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. జ్ఞాపకశక్తి, వివేచనాశక్తి, వికాసం నిరంతర ప్రక్రియ అన్నారు. భూమిని భావితరాలకు సురక్షితంగా అందించేందుకు పర్యావరణ అనుకూల జీవన విధానాన్ని వివరించారు. కళాత్మక నాటక రంగంలో 400కు పైగా విభిన్న పాత్రలు పోషించడం, టైపింగ్ వేగంగా చేయడం వంటి అనేక అంశాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం 25 వేల విలువచేసే దేశ నాయకుల, సంఘ సంస్కర్తలు, శాస్త్రవేత్తల చిత్రపటాలు, మెడికల్ కిట్లు, వాటర్ క్యాన్, వరల్డ్, ఇండియా, తెలంగాణ, మ్యాప్స్, గోడ గడియారం, ఆట వస్తువులు క్లాత్ బాగ్స్‌ను అందించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి మంజుల, అధ్యాపకులు అజాం, బాబూరావు, యాకూబ్, రాములు సదానందం, గోపాలకృష్ణ, వెంకట్, గణేశ్, రాజేందర్, లావణ్య పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్



కమ్యూనిటీ శానిటరి కాంప్లెక్స్ పనులు ప్రారంభిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

దామెర : ప్రజల సౌకర్యార్థం కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులు శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో భాగంగా స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా రూ.3,00,000 నిధులు మంజూరు చేయగా రూ.2,10,000 ఈజీఎస్ నిధులు రూ.90,000 జీపీ నిధులతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. మార్చ్ 31లోపు నిర్మాణ పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీఓ రంగాచారి, ఎస్సై కొంక అశోక్, మెడికల్ ఆఫీసర్ మహేందర్, ఏపీఓ శారద, టీఏలు ప్రిసిల్లా, సురేందర్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తోటల పెంపకానికి నైపుణ్యం అవసరం

- అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు

కమలాపూర్ : పండ్లు, పూలు, కూరగాయల నర్సరీ నిర్వహణ, తోటల పెంపకానికి నైపుణ్యం అవసరమని, అధిక లాభాలు పొందేందుకు రైతులు సూచనలు పాటించాలని అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాసరావు సూచించారు. ఉపాధి హామీ పథకంలో మూడేళ్ల పాటు వంద రోజులు పనిపూర్తి చేసిన ఉపాధి కూలీలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నర్సరీల నిర్వహణపై శనివారం నిర్వహించిన ఉన్నతి నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నర్సరీల నిర్వహణ, తోటల పెంపకంలో నైపుణ్యం కనబర్చిన వారిని ప్రోత్సహిస్తూ ఉద్యాన శాఖ ద్వారా సబ్సిడీలు ఇప్పిస్తామన్నారు. ఎన్‌ఎల్‌ఎం కింద పశువుల పెంపకం చేపడితే 50 శాతం వరకు సబ్సిడీ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాజు, జేడీఎం శ్రీనివాస్, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ రవి, ఈజీఎస్ ఏపీఓ రమేశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



విద్యార్థులు పోగుచేసిన వస్తువులు, పండ్లు

దామెర: సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఏకశిలా విద్యా సంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాల విద్యార్థులు పోగుచేసిన నిత్యావసర సరుకులు, పండ్లు, కూరగాయలు శనివారం సహృదయ వృద్ధాశ్రమంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశనుంచే సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ మణికుమార్, స్టాఫ్ ఇన్‌చార్జ్ విజయ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె



సమ్మెలో పాల్గొన్న హమాలీ కార్మికులు

పరకాల : డిమాండ్లను నెరవేర్చాలని సివిల్‌సప్లై గోదాం హమాలీలు చేపట్టిన సమ్మె శనివారం నాలుగో రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు మచ్చ శంకర్, గడ్డల సురేష్, మచ్చ సందీప్, బొచ్చు కృష్ణ, కొమ్ము మహేందర్, బొజ్జ భిక్షపతి, సర్వేశం పాల్గొన్నారు.